# పెళ్ళి

## దేశెట్టి కేశవరావ్




"టెలిగ్రాం, సార్!" అనగానే హై జంప్ చేసేవాళ్ళలా అంతెత్తు ఎగిరి, తిరిగి యీ భూప్రపంచకంమీదికి పడేవాళ్ళు చాలామంది వున్నారు అలాంటివాళ్ళలో ముఖ్యుడు శశిధర్. ఈ తరహా మనస్తత్వాన్ని వివరించమని అడిగితే ఇంగ్లీషువాళ్ళు టెలిగ్రోఫోబియా అనీ, హిందీ వాళ్లయితే తార్‌భీతి అనీ, తెలుగు మనస్తత్వ శాస్త్రజ్ఞులయితే 'తంతీ భయం' అనీ అనొచ్చునేమో!

ఆ రోజు ఆఫీసయిపోయాక కాంటీనులో యింత కతికి, గదికి వచ్చి నడుం వాల్చారు శశిధర్, అతడి మిత్రుడు రాజూను. ఆఫీసు వేళల మార్పువల్ల యీమధ్య వాళ్ళకి యింట్లోనే హాయిగా పడుకోవడం సాధ్యం అవుతున్నది. పర్సనల్ రిజిష్టరులో ఆఫీసరుకు తెలియకుండా మార్పులెలా చెయ్యాలో ఉదాహరణలతోసహా శశిధర్ వివరిస్తోంటే వింటున్నాడు రాజు. ఇంతలో తలుపు చప్పుడయింది.

"ఎవరో వచ్చినట్టున్నారు చూడరా!" అనేసి రాజు మంచినీళ్ళు తాగడానికి లోపలి గదిలోకి వెళ్ళాడు. రాజు తిరిగి వచ్చేసరికి శశిధర్ అచేతనంగా నేలన పడివున్నాడు.

"ఏంజేశావయ్యా?" కోపంగా పోస్టుమాన్‌ని చూస్తూ అతడి దగ్గరకి పరిగెత్తాడు రాజు. ముక్కుపై జారిపోతున్న కళ్ళజోడుని ఎగదోసుకుంటూ విచిత్రంగా అతణ్ణే చూస్తున్న మెసెంజర్, ఆ మాటలకి రాజువేపు తిరిగాడు.

"నేనేం చెయ్యలేదు సార్! టెలిగ్రాములు వచ్చాయండీ అన్నాను. ఇలాగయ్యారు" అన్నాడు ఆ మెసెంజర్ ఆందోళనగా.

"టెలిగ్రాములా?" రాజు తీక్షణంగా ప్రశ్నించాడు.

"అవునండి!"

"ఎన్నున్నాయి?"

"మూడండీ!"

"ఆఁ! చూశావా! అదీ సంగతి! మావాడికి కాస్త టెలిగ్రోఫోబియా వుందిలే!" అన్నాడు రాజు, అసలు విషయం తెలిసిన తర్వాత.

"ఎంత మాట!" అన్నాడు మెసెంజర్.

"దాన్నే అచ్చమైన హిందీలో చెప్పాలంటే తార్‌భీతి అనొచ్చు" అని రాజు వివరించాడు.

"బాగా శలవిచ్చారు!" అన్నాడు మెసెంజర్ కాయితాన్ని తీస్తూ.

'అదే ఆంధ్ర మనస్తత్వజ్ఞులయితే తంతీ భయం అంటారేమో!" అన్నాడు రాజు.

"ఉన్నమాటన్నారు! నాకెంతో నచ్చింది!" అన్నాడతను. "మీరైనా యీ టెలిగ్రాములు తీసుకోండి. నేను యింకా యిద్దరి బీట్లు చూసుకోవాలి!" అని రాజుకి కాయితాన్ని అందించాడు. రాజు ఆ కాయితంమీద సంతకాలు చేసి, టెలిగ్రాములు తీసుకున్నాడు.

మెసెంజరు వెళ్ళిపోయాక టెలిగ్రాములు చింపి చదివాడు రాజు. అవి పెళ్ళిళ్ళ వేటకి సంబంధించినవి. శశివాళ్లవాళ్లే యిచ్చారు.



ఇంతలో శశిధర్ కదిలాడు. "రేయ్ శశీ! లేవరా!" అని రాజు వాణ్ణి కుదిపాడు.

"వారే రాజూ!" అని ఏడుపుమొహంపెట్టి రాజు చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు శశిధర్.

"ఏడుస్తావెందుకురా, పిరికిశుంఠా! నీకు మూడు టెలిగ్రాములొచ్చాయి... భయపడకు! అన్నీ పెళ్ళిళ్ల యింటర్‌వ్యూలని గురించినవే! లేచి కూర్చో, చెప్తాను!" అన్నాడు రాజు.

శశి కోలుకుని లేచి కూర్చున్నాడు. "ఏమిటి విశేషాలు, చెప్పు!" అనడిగాడు.

"చూడు, యిది మీ మేనమామ యిచ్చింది. ఇంటర్‌వ్యూ యిరవై ఏడోతేదీన ఏర్పాటు చేసాడట. ఇక యిది, మీ బాబాయి యిచ్చింది. ఇరవై రెండున — అంటే మర్నాడు — వాళ్ల వూళ్ళో పెళ్ళిచూపులట. ఈ చివరిది మీ పెదనాన్నగారిచ్చారు ఇరవైనాలుగున వాళ్ల వూళ్ళో అమ్మాయిని చూసుకోవాలట!" అన్నాడు రాజు.

"నిజంగా?" అనడిగాడు శశి.

"కావలిస్తే నువ్వే చదువుకో! ... యిక బయలుదేరు, బస్సుకి టయిమవుతోంది!" అన్నాడు రాజు.

"నేనా?" అన్నాడు శశిధర్.

"అదేమిటూ వెర్రి?" అనడిగాడు రాజు.

"నువ్వు రాకుండా నేనెలా వెళ్లేదిరా?" అన్నాడు శశి. "నాకు పెళ్లి వద్దు మొర్రో అంటే వినకుండా, కాస్తన్నా దయలేకుండా యిలా వైర్లమీద వైర్లిస్తున్నారు," అన్నాడు.

"బాగుంది. ఏదో సామెత చెప్పినట్టు వాళ్ళ నీమీద దండెత్తుతుంటే నువ్వు నామీద దండెత్తుతున్నావేం?" అన్నాడు రాజు.

"నువ్వెలాగైనా అనుకో! నువ్వు వచ్చావంటే ఎలాగో నేనీ గండాలు తప్పించుకుంటాను" అన్నాడు శశి.

"ఇది మరీ బావుంది. వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చెయ్యమన్నారుగానీ, యిలాగా చెడగొట్టమనలేదు. ఎంతో పాపం!" అన్నాడు రాజు.

"బాబ్బాబు! అలాగనకు. ఇది పాపంగాదు, పుణ్యం. ఎలాగో యీ పుణ్యంకట్టుకో!" అన్నాడు శశి.

"చూద్దాంమరి! నువ్వంతగా అడుగుతుంటే తప్పుతుందా! పద!" అన్నాడు రాజు.

శశిగాడి బాబాయి వాళ్ల వూరి కెళ్లేసరికి సాయంత్రమైంది. రాత్రి అక్కడ విశ్రాంతి తీసుకుని ఉదయాన పెళ్లిచూపులకి బయల్దేరారు. "కుర్రాళ్ళు! మీరెళ్లిరండి!" అన్నాడు శశి వాళ్ళ బాబాయ్

"అదెలాగండీ, పెద్దలు మీరులేకుండా ఎలాగ?" అన్నాడు రాజు.

"అదేంలేదోయ్! ఈ తతంగమంతా ఒక ఫార్మాలిటీ. వాళ్ళు మనకి బాగా తెలిసినవాళ్ళను. ఊరికే అలా ఫ్రెండ్సు యింటికి వెళ్ళొచ్చినట్టు వెళ్ళిరండి. పెద్ద పట్టింపులూ అవీ పెట్టుకోకుండా అమ్మాయిని చూసిరండి. నచ్చితే మిగతా విషయాలు తర్వాత చూసుకుందాం!" అన్నాడాయన.

తప్పదుకాబట్టి ఇద్దరూ బయలుదేరారు. అసలు ఈ బాబాయి అంటే శశికి గొప్ప గౌరవం. శశి చిన్నప్పుడే తలిదండ్రులు పోతే, వాడికి విద్యాబుద్ధులు చెప్పించి, ఓ ఉద్యోగంలో వేసి పురుషుడిగా నిలబెట్టింది ఈయనేనట. అందుకే ఆయన మాటంటే గొప్ప గురి శశికి.

అయితే ఈ కారణంవల్లనే రాజు గొప్ప యిరకాటంలో పడ్డాడు. శశికి ఈ అమ్మాయి నచ్చలేదని ఎలాగా చెప్పడం అని ఆలోచనలో పడ్డాడు రాజు.

మొత్తానికి పెళ్ళివారిల్లు సులభంగానే కనుక్కోగలిగారు. గేటు ముందు నిలబడి "రమణరావుగారూ!" అని రెండుసార్లు పిలిచాడు రాజు. ఎవ్వరూ పలకలేదు. తలుపు గొళ్ళెంవేసి వుండకపోవడం గమనించి, తలుపుతోసుకుని గుమ్మం వద్ద నిలబడి "రమణరావుగారూ!" అని పిలిచాడు.

కాసేపటికి ఒక వృద్ధురాలు వచ్చి "రండి నాయనా! కుర్రాడు ఇంట్లో లేడు! యిప్పుడే వస్తాడు. కూర్చోండి!" అంది.

ఇద్దరూ గదిలోకి అడుగుబెట్టారు. గదంతా అస్తవ్యస్తంగా వుంది. కుర్చీల మీద బట్టలు వేళ్ళాడుతున్నాయి. "ఈ ముసలామె కూర్చోమంటుంది. ఎక్కడ కూర్చోవడం?" అన్నట్టు మిత్రులిద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు.

"పట్టింపులేవీ పెట్టుకోవద్దన్నాడు మీ బాబాయ్!" అని రహస్యంగా మిత్రుడికి చెప్పాడు రాజు.

"మీ రెండు కొచ్చినట్టో!" అనడిగింది ముసలమ్మ జనాంతికంగా.

"చలమయ్యగారు పంపించారండీ!" అన్నాడు రాజు తికమకగా. ఆవిడ ప్రశ్నకి జవాబు చెప్పడానికి యింతకంటే మరో విధానం కన్పించలేదు.

"అలాగా! కూర్చోండి. ఆ బట్టలుతీసి బెంచీమీద వేసి, కుర్చీల్లో కూర్చోండి నాయనా! చదువుకున్నవాళ్ళలాగున్నారు!" అందావిడ.

"నో పట్టింపులు!" అని రాజు గొణిగి, రెండు కుర్చీలమీద బట్టలూ తనే తీసేసి "కూర్చోరా శశీ!" అన్నాడు.

"బాగానేవుందిరా పెళ్ళికొడుక్కి మర్యాద!" అన్నాడు శశి. "పట్టింపులు పెట్టుకోవద్దంటే బొత్తిగా యింతలా అవుతుందనుకోలేదు!" అన్నాడు.

మిత్రులిద్దరూ కూర్చొని రెండు నిమిషాలు అటూ, యిటూ చూసేసరికి "నమస్కారం! నమస్కారం!" అనుకుంటూ వో మధ్యవయస్సు మనిషి ఇంట్లోకి వచ్చాడు.

రాజు లేచి నించొని, "నమస్కారం! నా పేరు రాజు. శశిధర్ అంటే యితనేనండీ! చలమయ్యగారు పంపారు!" అన్నాడు.

సంచీ కిందని పెట్టి "చలమయ్యగారు పంపారా?" అని ఆలోచనలో పడ్డాడు. వెంటనే తేరుకుని "అయితే యితనేనన్నమాట. ఎవరు పంపితేనేంలెండి! వాతలక్షణాలు స్పష్టంగా కనబడుతున్నాయి!" అన్నాడు.

"ఏమిటండీ అంటున్నారు?" అనడిగాడు రాజు. శశి దగ్గాడు.

అతనన్నాడు: "చూశారా! ఆ దగ్గు. అదే వాతలక్షణం. పెన్సిలిన్ ఇంజెక్షన్లు వో కోర్సు యిచ్చి కాసహరి మాత్రలు రెండు మండలాలు యిచ్చామంటే తక్కున కట్టేస్తుంది."

"అదికాదండీ! మేము ... మేము ... యితడూ..." ఏదో చెప్పబోయాడు రాజు.

"చెప్పండి! పరవాలేదు. ఎలాంటి జబ్బులకైనా నాదగ్గర మందుంది. కాన్సర్ బాగుచేశానండీ! కాన్సర్!" అన్నాడతడు బెంచీ మీద కూర్చొని లేశం గర్వంతో.

రాజు ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తున్నాడు. "మీ పేరు రమణరావేనా?" తీక్షణంగా అడిగాడు శశి.

"భిషగ్రాట్, వైద్య విశారద. అవి టైటిల్స్ ... యింతకీ ఇది పురాణ వాతరోగం ఉధృతంగా వుంది. దీనికి అరిష్టాలూ, విటమిన్ టాబ్లెట్లూ, కాల్షియం, ఇంజెక్షన్లూ పడాల్సిందే!" అన్నాడతను.

"పెళ్ళిచూపుల కొచ్చామండీ! మీ అమ్మాయి వుందటగా! నాట్యం కూడా నేర్చుకుంది! మావాడి బాబాయ్ చెప్పారు!" అన్నాడు రాజు.

అతను విచిత్రంగా రాజుకేసి చూశాడు. "హే భగవాన్! చిత్తభ్రమ!" అన్నాడు.

"రాజూ! నే వెళ్తున్నా!" అని గబుక్కున లేచి బయటికి నడిచాడు శశి. రాజు అతణ్ణి అనుసరించాడు.

"అరరే! అలా భయపడకండి. అన్నిరకాల మనోవ్యాధులకీ సంజీవనిలాంటి..." వెనకనించి అతడు అరుస్తోంటే వినిపించుకోకుండా వచ్చేశారు.

"ఒరే, మా పెదనాన్నగారి వూరెళ్దాం పద!" అన్నాడు బయటికొచ్చాక శశి.

"ఛఛ! అదేం మాట. అసలు ఇంటికే వెళ్ళొద్దా?" అన్నాడు రాజు.

"అదేం కుదర్దు! బాబాయి చెప్పినట్టే చేశాం. ఎంత పట్టింపులు వద్దనుకున్నా వాళ్ళింట్లో మనకి ట్రీట్‌మెంట్ సరిగాలేదు. ఆమాటే బాబాయితో చెప్పేద్దాం. అబద్ధం ఆడినట్టుకూడా వుండదు' అన్నాడు శశి.

"అదేంమాట! పొరపాట్న మనం యింకోరి ఇంటికి వెళ్ళామని మీ బాబాయికి తెలియదా?" అడిగాడు రాజు.

"తెలిస్తే తెలుస్తుంది ... అరే, పొరపాటు పడ్డామా! అని అప్పుడు ఆశ్చర్యం అభినయించొచ్చు. ప్రస్తుతానికి గండం ఎలాగో గడిచింది!" అన్నాడు శశి.

"అంతేనంటావా?" అన్నాడు రాజు.

"అంతే! పద! బస్సుకి టైమవుతుంది!" అన్నాడు శశి.

వాళ్ళ పెదనాన్నగారి వూరు వచ్చి రెండు రోజులు విశ్రాంతి తీసుకున్నారు. మూడో రోజు పెళ్ళిచూపులకి ప్రయాణం కట్టించాడు ఆయన. ఈ రెండు రోజుల్లోనూ ఆయన పెళ్ళికూతురి తరపువాళ్ల విషయాలన్నీ ఏకరువుపెట్టాడు. ఆ అమ్మాయి మంచి వుద్యోగం చేస్తోందట. వాళ్ల నాన్న పెద్ద ఆఫీసరట. అమ్మాయి బాగానే వుంటుందట. మంచీ, మర్యాదా తెలిసినవాళ్లట. వగైరా, వగైరా.

పెళ్ళిచూపుల కెళ్లినపుడు, అమ్మాయి తండ్రి మర్యాదగానే ఆహ్వానించాడు. ఎంత పెద్ద ఆఫీసరయినా. రాజు వాళ్ల ఆదరణకి ముగ్ధుడయిపోయాడు.

ఫలహారాలయాక "అమ్మాయిని పిలుస్తాను," అన్నాడు శశి పెదనాన్నతో.

"అలాగేనండి!" అన్నాడాయన.

ఆయన గొంతు సర్దుకున్నాడు: "చూడండి! మా అమ్మాయి వుద్యోగం చేస్తోంది. వీళ్లూ వుద్యోగస్థులు యీ కాలం కుర్రాళ్ళు పాతపద్ధతులంటే అంత యిష్టపడరు. వాళ్ళు మాట్లాడదలచుకుంటే మనం వుంటే బిడియపడతారు. మీరేమీ అనుకోకపోతే..." అన్నాడాయన.

"అలాగే, పదండి!" అన్నాడు శివరామయ్య, శశి పెదనాయన. రాజు తనూ లేవబోయాడు. పెళ్లికూతురు తండ్రి "మీరుండండి! మీరంత యంగ్‌స్టర్స్. మా అమ్మాయితోబాటు తన ఫ్రెండూ వస్తుంది!" అని వెళ్లిపోయాడు. శివరామయ్య ఆయన్ని అనుసరించాడు.

శశి "వారే రాజూ! ఇదేదో నవలల్లో జరిగే యింటర్‌వ్యూలాగుందిరా!" అన్నాడు.

రాజు "ఇదో కొత్త పద్ధతిలాగుంది. మనం హోప్‌లెస్‌లీ అవుటాఫ్ డేట్ అయిపోయినట్టున్నాం" అన్నాడు.

"గుడ్‌మార్నింగ్!" అంటూ పెళ్లికూతురు గాబోలు వచ్చింది. ఆమె వెంట మరో అమ్మాయి కూడా వుంది.

"అయామ్ సరోజ. మీట్ మై ఫ్రెండ్ లలిత" అంది ఆఫీసరుగారి అమ్మాయి.

"న...న...నమస్కారం" అన్నాడు వెర్రి మొహం వేసుకుని రాజు. శశి "గుడ్‌మార్నింగ్" అన్నాడు ధాటీగా.

"హూ యీజ్ శశిధర్?" అనడిగింది సరోజ.

"నేనేనండి"

"యువర్ ఫ్రెండ్?"

"రాజండీ!"

అందరూ కూర్చున్నారు. పొడి, పొడిగా వాళ్ల ప్రశ్నలకి జవాబిచ్చారు మిత్రులు.

"ఉద్యోగం గురించి మీ అభిప్రాయం?" హఠాత్తుగా అడిగింది శశిధర్ని సరోజ.

శశి గొంతు సర్దుకున్నాడు. "ఉద్యోగం... ఉద్యోగం..." అని నీళ్ళు నమిలాడు కాసేపు.

"డ్యూటీ ఆనెస్ట్‌గా చెయ్యాలంటాను నేను... నా కో క్లర్క్ ఒకడున్నాడు. మా నాన్న దగ్గర వాడి ఆటలేం సాగవనుకోండి! అయినా వొకరోజేం చేశాడో తెలుసా?" అనడిగింది.

"చెప్పండి!" అన్నాడు రాజు.



# వేట

"చెప్పండి!" అన్నాడు శశి

"పర్సనల్ రిజిస్టర్‌లో మా నాన్న సంతకాలు చేశాక, ఆయనకి తెలియకుండా కొన్ని రిమార్కులు చేర్చి, మార్పులు చేశాడు!" అంది కోపంగా సరోజ.

"బ్యాడ్! వెరీ బ్యాడ్!" అన్నాడు రాజు

"అదే, అదే!" అన్నాడు శశి

"ఇలాంటి రోగ్స్‌ని ఏం చేయాలో చెప్పండి!" అంది సరోజ

రాజు శశి మొహంలోకి చూశాడు శశి "అదే! అహ!" అన్నాడు

రాజు, "నిజమే మరి!" అన్నాడు

"వీళ్లని డిస్మిస్ చెయ్యాలంటాన్నేను ఏమంటారు?" అంది సరోజ

"మేం వెళ్లొస్తామండీ!" అని శశి లేచివెళ్లాడు.

"వస్తామండీ!" అని తనూ లేచిపోయాడు రాజు

ఆ అమ్మాయికి చాలా అహంకారమనీ, వాళ్ల సంబంధం కుదిరేదికాదనీ వాళ్ల పెదనాన్నకి చెప్పిచెప్పి మళ్లీ వేటకి బయల్దేరారు మిత్రులు

ఉదయానికి శంకర్రావుగారి వూరికి చేరుకున్నారు శశీ వాళ్ల మామయ్య స్టేషనుకి వచ్చాడు మధ్యాహ్నం మంచి విందు చేశాడు ఆయన వాళ్లింట్లో

భోజనాల దగ్గర చెప్పాడాయన "ఒరే అబ్బాయ్! అమ్మాయి సంగతి నే జెప్పితే నీకు విడ్డూరంగా వుంటుంది కట్నం తక్కువని వెనకాడ్డమే గానీ, అమ్మాయి చక్కగా వుంటుందనుకో. ఉద్యోగస్తురాలుకూడా! మంచి సంప్రదాయం, మంచికుటుంబం అసలు నువ్వు చూడవలసిన అవసరంకూడా లేదు, నేనే నీ తరపున వొప్పేసుకుందామనుకున్నాను నువ్వు ఈ సంబంధం కాదనవని నాకు బాగా నమ్మకం!"

"నువ్వింతగా చెప్పితే నమ్మకపోవడానికేముంది మామయ్యా!" అన్నాడు శశి.

పెళ్లిచూపులకి మర్నాడు ఉదయాన బయలుదేరారు.

"అమ్మయ్య వచ్చేశారా? వర్షం వచ్చేస్తోందని గాభరాపడుతున్నాను" అన్నాడు పెళ్లికూతురు తండ్రి

కాఫీ, ఫలహారాలయ్యాయి అమ్మాయిని తీసుకొచ్చి వారగా చాపమీద కూర్చోబెట్టారు తెల్ల జరీచీర కట్టుకుంది ఎర్రని బార్డరు నుదుట దోసగింజంత తిలకం ఆమె సిగ్గుగా నడిచివస్తోంటే రాయంచ గమనాన్ని బోలిన ఆ నడకని చూసి శశి మనసు పట్టుతప్పింది "కొంతమంది వెధవలు నాకు పెళ్లి వద్దు మొర్రో అని ఎందుకు అంటారో!" అనుకున్నాడు

రాజు ప్రశంసగా మిత్రుడికేసి చూసి కళ్ళెగరేశాడు శశి సిగ్గుగా తల వంచుకున్నాడు రాజు "అమ్మయ్య!" అనుకున్నాడు.

"వారే! అమ్మాయిని యిప్పుడే బాగా చూడరా!" అన్నాడు శంకర్రావు శశితో అమ్మాయి సిగ్గుతో తల వంచుకుంది మరింతగా

"ఏదైనా అడగదల్చుకుంటే అడగండి!" అన్నాడు శశి కాబోయే మామగారు శశి సిగ్గుపడ్డాడు.

"రాజా! నువ్వైనా అడగరా!" అన్నాడు శంకర్రావు.

"మీ ... మీ .. పేరేమిటండీ!" అనడిగాడు రాజు బెరుకుగా

"సుజాత!" అందా అమ్మాయి తల వంచుకునే మధురమైన ఆమె కంఠం శశి హృదయంలో వీణ మీటినట్టయింది

"ఏమిట్రా అంత నంగిగా మాటాడతావు అమ్మాయి చూడు ఎలా మాటాడుతోందో!" అన్నాడు శంకర్రావు

"ఈ కాలం పిల్లలు ఇంతేనండీ! ఆడపిల్లలతో ధైర్యంగా మాటాడటంకూడా చాతకాదు!" అన్నాడాయన పెంకులెగిరిపోయేలా నవ్వుతూ

"అమ్మాయ్! యివాళ ఆఫీసు కెళ్లవా?" అనడిగాడు ఆ అమ్మాయిని

సుజాత తలెత్తి ఆయన్ని చూసింది. "వెళ్లానండి బాబాయిగారూ! ఇవ్వాళ ప్రొద్దుట వచ్చిందిగా మీకొక టెలిగ్రాం నేనే అందుకున్నాను!" అందామె

ఎందుకో ఆమె మాటల్లో కాస్తంత కర్కశత్వం వినిపించింది శశికి ఆమె మాటలు మాటలుగా వినిపించలా కట్టుకడ, కట్టుకడ, కట్టుకట్టుకడ అంటున్నట్టుంది

"బళ్ళారినుంచేదో వచ్చిందండీ! మీ బిజినెస్ వ్యవహారమేదో!" అందామె

మళ్లీ టెలిగ్రాఫ్ యంత్రం కొట్టుకొంటోంది కట్టుకడ, కట్టుకడ అని

"అమ్మాయి టెలిగ్రాఫిస్టుగా పని చేస్తోందోయ్ గొప్ప ఎఫిషియంటు—" శంకర్రావేదో చెప్పుకుపోతున్నాడు.

"గాలి, గాలి కావాలి నాకు! ఉక్క పోస్తోంది!" అని శశి విసురుగా బయటికి పారిపోయాడు.

"శశీ, శశీ!" అనుకుంటూ రాజు వాడి వెంట పరిగెత్తాడు

"ఏమిట్రా, ఏమిటి?" శంకర్రావు వాళ్ల వెంట పరిగెత్తడానికి ప్రయత్నం చేశాడు

ఊరికెళ్ళే బస్సులో కూర్చుని శశి అన్నాడు మిత్రుడితో: "అందుకేరా, ఇంగ్లీషువాడన్నాడు. అమ్మాయిలకందరికీ పెళ్లి కావాలి! కానీ అబ్బాయెవ్వడూ పెళ్లి చేసుకోకూడదు అని."

"మరి ?" అన్నాడు రాజు

ఇంతలో బస్సు బయలుదేరింది